సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
శనివారం | 23 | డిసెంబర్ | 2023



నిత్యాన్నదానానికి విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి అనంతపురానికి చెందిన గద్వాల నర్సింహ మూర్తి శుక్రవారం రూ.1,00,016 విరాళాన్ని సమర్పించారు.



సుదర్శన హోమానికి విరాళం

సఖినేటిపల్లి:అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నార సింహ సుదర్శన హోమం కోసం మార్టేరుకు చెందిన తాడి వెంకట శ్రీనివాసరెడ్డి శుక్రవారం రూ.లక్ష విరాళాన్ని దేవ స్థానం సూపరింటెండెంట్ విజయసారథికి అందజేశారు.

డెల్టా కాలువలకు నీరు



ధవళేశ్వరం:డెల్టా కాలువలకు కాటన్ బ్యారేజ్ నుంచి శుక్రవారం నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3400,మధ్య డెల్టాకు 1600,పశ్చిమ డెల్టాకు 6000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

'ఆడుదాం ఆంధ్ర'కు పకడ్బందీగా ఏర్పాట్లు

అమలాపురం రూరల్: ఈ నెల 26 నుంచి జరిగే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్, ఆడుదాం ఆంధ్ర నోడల్ అధికారి ఎస్.నూపుర్ అజయ్ తెలిపారు. ఈ పోటీలు ఫిబ్రవరి 10వ తేదీ వరకూ 47 రోజుల పాటు జరుగుతాయని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలను స్త్రీ, పురుష విభాగాల్లో విడివిడిగా నిర్వహిస్తామన్నారు. తొలుత సచివాలయ స్థాయిలో పోటీలు జరుగుతాయని, అనంతరం ఆయా క్రీడల్లో విజేతలతో జట్లు సిద్ధం చేసి, మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. మండల స్థాయి విజేత జట్లు నియోజకవర్గ స్థాయిలో.. అక్కడ ప్రతిభ చూపిన వారు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయని జేసీ తెలిపారు. జిల్లా స్థాయి విజేత జట్లు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఈ పోటీల కోసం జిల్లా వ్యాప్తంగా 189 క్రీడా ప్రాంగణాలను ఎంపిక చేశారన్నారు. 1,12,338 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, ఇప్పటికే క్రీడా పరికరాలను గ్రామ సచివాలయాలకు పంపిణీ చేశామని వివరించారు. ఏ జట్టు ఏ జట్టుతో ఎప్పుడు పోటీ పడాలో గ్రామ సచివాలయాల నోటీసు బోర్డుల్లో ముందుగా ప్రదర్శిస్తారని తెలిపారు. ఈ పోటీల స్కోరింగ్ ప్రక్రియ ఆన్‌లైన్‌లో నమోదవుతుందన్నారు. ఈ క్రీడా పోటీలపై విస్తృత అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ నెల 24న యోగా, క్రీడా నినాదాలతో మారథాన్ ర్యాలీ నిర్వహిస్తామని జేసీ నూపుర్ అజయ్ తెలిపారు.

వెంకన్న ఆలయానికి రూ.2.50 లక్షలతో సింహద్వారాలు



ఆలయ సింహద్వారాలను ప్రారంభిస్తున్న విరీతాదేవి, ధర్మకర్తలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ప్రధాన ఆలయానికి ఉత్తర, దక్షిణ ముఖ సింహద్వారాలను పట్టణానికి చెందిన పచ్చిగోళ్ల సోమరాజు, సీతామహాలక్ష్మి దంపతులు తయారు చేయించారు. రూ.2.50 లక్షల వ్యయంతో పూర్తి టేకుతో తయారు చేసిన ఈ సింహద్వారాలను ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి శుక్రవారం ప్రారంభించారు. ఆలయం ఆధునీకరణ పనుల్లో భాగంగా సింహద్వారాలను ప్రత్యేకంగా తయారు చేయించిన సోమరాజు దంపతులను విరీతాదేవి, ధర్మకర్తలు సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు దూడల ఫణి, ధర్మకర్తలు నడింపల్లి వర్మ, యెండూరి నాగేశ్వరరావు, ముంగర ప్రసాద్, సంసాని అబ్బు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షునిగా శ్రీధర్

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీని అధిష్టానం నియమించింది. జిల్లా అధ్యక్షునిగా కప్పల శ్రీధర్(కొత్తపేట నియోజకవర్గం)ను నియమించారు. ఉపాధ్యక్షులుగా కొంబత్తుల యేసుబాబు (పి.గన్నవరం), మోకా అప్పాజీ (ముమ్మిడివరం); ప్రధాన కార్యదర్శులుగా జల్లి శ్రీను (పి.గన్నవరం), బడుగు శ్రీనివాసరావు (ముమ్మిడివరం), సాదె సత్యనారాయణ (రామచంద్రపురం), కె.బాబ్జీ (అమలాపురం), రొక్కాల వెంకట్ (రాజోలు), రవి రాజు (కొత్తపేట), చాపల అబ్బన్న (మండపేట); కార్యదర్శులుగా నక్కా బాలకృష్ణ (పి.గన్నవరం), నామాడి శ్రీనివాసరావు (పి.గన్నవరం), మోకా మధు (ముమ్మిడివరం), పాము చిట్టిబాబు (ముమ్మిడివరం), పలివెల నాగరాజు (రామచంద్రపురం), మందపల్లి చిట్టిబాబు (రామచంద్రపురం), ఎస్.నరసింహమూర్తి (అమలాపురం), ఎం.శ్రీనివాసరావు (అమలాపురం), దాకే చిరంజీవి (రాజోలు), రొక్కాల సందీప్ (రాజోలు), ఎస్.రాజేష్ కుమార్ (కొత్తపేట), యేగి చంద్రశేఖర్ (కొత్తపేట), పాలమల సత్తిబాబు (మండపేట), గెడ్డం గాంధీబాబు (మండపేట); సంయుక్త కార్యదర్శులుగా ఉందుర్తి నాగబాబు (పి.గన్నవరం), కాట్రు వెంకటేశ్వరరావు (పి.గన్నవరం), కత్తుల సుదర్శనం (ముమ్మిడివరం), వడ్డి గౌతమ్ (ముమ్మిడివరం), బుంగా రాజు (రామచంద్రపురం), చిల్లే నాగేశ్వరరావు (రామచంద్రపురం), పి.శ్రీనివాస (అమలాపురం), ఎ.సూరిబాబు (అమలాపురం), రాపాక సూర్యప్రకాష్ (రాజోలు), యడ్ల నూకయ్య (రాజోలు), ఇ.పండు (కొత్తపేట), కె.రామకృష్ణ (కొత్తపేట), బక్కి సుధాకర్ (మండపేట) నియమితులయ్యారు.

నీరా 'జనం'



మండపేటలో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర బహిరంగ సభకు తరలివచ్చిన అశేష జనవాహినలో ఒక భాగం

- 'దేశం' అడ్డాలో మార్మోగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార నినాదం
- జనసంద్రమైన మండపేట
- సామాజిక సాధికార బస్సు యాత్ర సక్సెస్
- బైక్‌లతో భారీ ప్రదర్శన
- ర్యాలీ, సభకు వేలాదిగా తరలివచ్చిన జనం
- బడుగులకు సీఎం జగన్ ప్రభుత్వం చేకూర్చిన మేలును వివరించిన నేతలు
- మిన్నంటిన 'జై జగన్' నినాదాలు

నీలాకాశం నేలకు దిగివచ్చి.. హరిత వర్ణంలో మెరిసిపోయే పుడమిని ముద్దాడినట్టు.. గోదావరి తూర్పు డెల్టాలోని కీలక ప్రాంతమైన మండపేట పట్టణం నీలి, ఆకుపచ్చ రంగు శోభను అద్దుకుంది. వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ జరిగిన వేళ.. ఆ పార్టీ పతాకాలు చేబూనిన బడుగు, బలహీన వర్గాల ప్రజానీకం.. పట్టణంలో వేలాదిగా కదం తొక్కారు. ఇప్పటికే గత గ్రామీణ/పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ టీడీపీ కంచుకోట బద్దలు కాగా.. ఇప్పుడు పూర్తిగా నేలమట్టమైందా అనే రీతిలో ప్రజలు వెల్లువలా ఈ యాత్రకు తరలివచ్చారు. ఊహించిన దానికి మించి ఈ కార్యక్రమం విజయవంతం కావడం వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలో ఫుల్ జోష్ నింపింది.

సాక్షి, అమలాపురం/కపిలేశ్వరపురం: నిన్న మొన్నటి వరకూ తెలుగుదేశం పార్టీ అడ్డాగా ఉన్న మండపేటలో వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార నినాదం దిక్కులు పిక్కటిల్లేలా ప్రతిధ్వనించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని, సాధికారతను వివరించే లక్ష్యంతో వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. దీనికి లెక్కకు మిక్కిలిగా జనం పోటెత్తారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి దారి పొడవునా అశేషంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. సాధికార యాత్ర సందర్భంగా ఉదయం నుంచీ మండపేటలో సందడి నెలకొంది. పెద్దకాలువ వద్ద నుంచి మెయిన్ రోడ్డు మీదుగా కలువ పువ్వు సెంటర్ వరకూ నీలం, పచ్చని రంగులతో కూడి వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. కార్యకర్తలు, నాయకులు పోటీ పడి ఫ్లెక్సీలు కట్టారు. బహిరంగ సభా వేదిక అయిన కలువ పువ్వు సెంటర్ వద్ద పార్టీ జెండాలను తోరణాలుగా కట్టి ముస్తాబు చేశారు. యాత్రకు మండపేట పట్టణం, రూరల్ మండలం, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలతో పాటు ఇతర నియోజకవర్గాల నుంచి సైతం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల వారితో పాటు పట్టణంలోని కోళ్ల ఫారాలు, రైస్ మిల్లులు, లారీ రవాణా కార్మికులు, వస్త్ర దుకాణాల శ్రామికులు అధిక సంఖ్యలో రావడం విశేషం. వీరందరి రాకతో మండపేట కలువపువ్వు సెంటరు జనసంద్రంగా మారింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన గారడీ కళాకారులు తమ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.



మండపేట పట్టణంలో భారీ జనసందోహంతో సాగుతున్న సామాజిక సాధికార బస్సు యాత్ర

జగన్ వెంట ఉన్నామని సభ ద్వారా చెప్పాం



మాకు జరుగుతున్న మేలు చూసి, మేమంతా సీఎం జగన్ వెంటే ఉన్నామని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఈ సభ ద్వారా తెలియజెప్పారు. చంద్రబాబు చెబుతున్న భరోసా మనకు కాదు.. కేవలం కొడుకుకు మాత్రమే భరోసా. మండపేట నియోజకవర్గ ప్రజలు గత ఎన్నికల్లో టీడీపీని గెలిపించి పొరపాటు చేశామని గుర్తించారు. అందుకే ఆ తరువాత జరిగిన మున్సిపాలిటీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో సరిదిద్దుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు డబ్బు సంచులను నమ్ముకుంటాడు. నేను జనాన్ని నమ్ముకుంటాను. సుఖంలో ఉన్న వారు నా వద్దకు రావద్దు. కానీ కష్టంలో ఉన్న వారిని నా వద్దకు రమ్మని కోరుతున్నాను.

– తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, మండపేట

మిన్నంటిన 'జగన్' నినాదాలు

సభా ప్రాంగణం జై జగన్, జై వైఎస్సార్ సీపీ నినాదాలతో హోరెత్తింది. మధ్యాహ్నం నుంచే జనం రాక ఆరంభమైంది. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా వేసిన కుర్చీలు నిండిపోవడంతో మహిళలు నిలుచునే నేతల ప్రసంగాలను శ్రద్ధగా ఆలకించారు. అంచనాలకు మించి జనం రావడం పార్టీ నేతల్లో హుషారు రేకెత్తించింది. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు ఆధ్వర్యాన జరిగిన ఈ బస్సు యాత్రలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్, రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ పిల్లి సుభాష్‌చంద్రబోస్, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర ఎస్సీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, పార్టీ బీసీ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు, బడుగు బలహీన వర్గాలకు, అన్ని వర్గాల్లోని పేదలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాజ్యాధికారంలో పెద్ద పీట వేయడం వంటి విషయాలను వక్తలు గణాంకాలతో వివరించినప్పుడు.. వివిధ రంగాల్లో తీసుకువస్తున్న విప్లవాత్మక మార్పులను నేతలు వివరించిన సమయంలో జనం పెద్ద పెట్టున హర్షధ్వానాలు చేస్తూ తమ మద్దతు తెలిపారు. ప్రతిపక్షాలు జగన్‌కు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నా, విషం చిమ్ముతున్నా వెనుకడుగు వేయకుండా సంక్షేమాన్ని అమలు చేస్తున్నారని వక్తలు చెప్పారు.

బైక్ ర్యాలీకి బ్రహ్మరథం

తొలుత మండల పరిధిలోని తాపేశ్వరంలో విలేకర్ల సమావేశం అనంతరం బస్సు యాత్ర ఆరంభమైంది. అక్కడి నుంచి వందలాది మోటార్ సైకిళ్లపై యువత, పార్టీ నాయకులు భారీ ర్యాలీగా వెంట రాగా బస్సు యాత్ర ముందుకు కదిలింది. ఈ యాత్రకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ర్యాలీగా వస్తున్న బస్సుపై నాయకులకు హారతులు పట్టేందుకు ఉత్సాహం చూపారు. అడుగడుగునా పూలవానలు కురిపిస్తూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. బస్సు మీద నుంచి మంత్రి జోగి రమేష్, ఎంపీలు బోస్, అనురాధ, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావు తదితరులు ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నుంచి సభా ప్రాంగణమైన కలువ పువ్వు సెంటర్ వరకూ ఉన్న ఒకటిన్నర కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు బస్సు యాత్రకు గంటకు పైగా సమయం పట్టిందంటే జనం ఎంతలా వచ్చారో అర్థం చేసుకోవచ్చు.



బహిరంగ సభలో ప్రసంగిస్తున్న మంత్రి జోగి రమేష్

యాత్రా విశేషాలు

- మండపేటలో బహిరంగ సభ జరుగుతుందనే సమాచారంతో మధ్యాహ్నం నుంచే పట్టణంలో సందడి నెలకొంది.
- పట్టణంలోని ప్రధాన రహదారి వెంబడి పెద్ద కాలువ నుంచి సభాస్థలి కలువ పువ్వు సెంటర్ వరకూ నీలి, ఆకుపచ్చని తోరణాలతో పట్టణం కొత్త శోభను సంతరించుకుంది.
- మండపేట పెద్ద కాలువ నుంచి ప్రారంభమైన సామాజిక సాధికార బస్సు యాత్రకు దారి పొడవునా మహిళలు హారతి పట్టారు. ఎక్కడికక్కడ నేతలపై స్థానికులు పూలవర్షం కురిపించారు.
- బైక్ ర్యాలీలో యువకులు 'జై జగన్' నినాదాలతో కేరింతలు కొడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు.
- బాణసంచా కాల్చి స్వాగతం పలికారు.
- గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన గారడీ కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.
- వైఎస్సార్ సీపీ జెండాలు చేతబట్టి యువకులు, మహిళలు యాత్రలో సందడి చేశారు.
- సామాజిక సాధికారత ప్రాధాన్యాన్ని వివరించే ఆర్కెస్ట్రా పాటలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

విపక్షాలపై వాగ్బాణాలు

బాబు గ్యారంటీ కాదు.. ఆయనకే గ్యారంటీ లేదు

బాబు వస్తున్నాడు.. మన భవిష్యత్తుకు గ్యారంటీ ఇస్తాడంట. అసలు బాబుకే గ్యారెంటీ లేదు. లోకేష్ పాదయాత్ర చేశాడు. మీకు కనిపించింది. పాదయాత్ర అంటే పొక్కుని రావడం కాదు. పాదయాత్ర అంటే వైఎస్సార్‌లా, జగన్‌లా చేయాలి. జనం మనస్సును తట్టాలి. ఇంత జనం వస్తే రేపు జనం లేరని రామోజీ, రాధాకృష్ణ, టీవీ–5, ఏబీఎన్‌లు రాస్తారు. వీరందరూ హైదరాబాద్‌లో ఉండి మన ప్రజల మీద విషం చిమ్ముతారు. పవన్ ఉన్న సభలో లోకేష్.. 'నా తండ్రి చంద్రబాబు సీఎం' అని చెప్పినా పవన్ కల్యాణ్‌కు సిగ్గనిపించడం లేదా?

– జోగి రమేష్, రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి

640 హామీల్లో 630 గాలికే..



మాజీ సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు 640 హామీలు ఇస్తే 630 గాలికి వదిలేశారు. టీడీపీ నాయకులు కులాల మధ్య విభేదాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తారు. అప్రమత్తంగా ఉండాలి. మండపేటలో ఒక సామాజికవర్గానికి పట్టం కట్టకుండా ఈసారి మార్పు చేయాల్సి ఉంది.

– పిల్లి సుభాష్‌చంద్రబోస్, రాజ్యసభ సభ్యుడు

జగన్‌కు బంధనాలు వేద్దామనుకుంటున్నారు



టీడీపీ, ఎల్లో మీడియా సీఎం జగన్‌కు బంధనాలు వేద్దామనుకుంటున్నారు. ఇలా చేస్తే మంట రగులుతుంది. 40 ఏళ్ల సీనియారిటీ ఉన్న నాయకుడు పేదల తలరాత ఎంత గొప్పగా మార్చారో చెప్పాలి. రాష్ట్రాలకు అప్పులే ఉంటాయి. దేశానికి రూ.176 లక్షల కోట్ల అప్పు ఉంది. అదంతా జగన్ చేసిందేనా? మండపేట టీడీపీ కోటను ఈసారి బద్దలుకొట్టడం ఖాయం.

– జూపూడి ప్రభాకరరావు, చైర్మన్, రాష్ట్ర ఎస్సీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్

కులగణన అద్భుతం



రాష్ట్రంలో కులగణనకు సీఎం జగన్ అంగీకరించడం అద్భుతమైన నిర్ణయం. బీసీల, మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వడంతో పాటు మహిళలకు సగానికి పైగా పదవులు ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్త ఒరవడి సృష్టించారు. మార్క్సిజాన్ని, లెనినిజాన్ని ఔపోశన పట్టి జగన్ పేదలకు, అణగారిన వర్గాల వారికి మేలు చేస్తున్నారు.

– కుడుపూడి సూర్యనారాయణరావు, ఎమ్మెల్సీ

ప్రశ్నించే తత్త్వమే పరిశోధనలకు పునాది

- పరాజయాలను విజయానికి మెట్లుగా మలచుకోవాలి
- జేసీ శ్రీవాస్ నూపుర్ అజయ్ కుమార్
- ఘనంగా జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



ప్రాజెక్టులను తిలకిస్తున్న జేసీ శ్రీవాస్ నూపుర్ అజయ్ కుమార్

రామచంద్రపురం: ప్రశ్నించే తత్త్వమే పరిశోధనలకు పునాది అని, ఎందుకు, ఏమిటి, ఎలా అనే ప్రశ్నల నుంచే నూతన ఆవిష్కరణలు పుట్టుకు వస్తాయని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నూపుర్ అజయ్ కుమార్ అన్నారు. స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జీవితంలో ప్రతి విషయం సైన్స్‌తో ముడి పడి ఉందని అన్నారు. తెలియని విషయాన్ని పరిశోధించి తెలుసుకోవాలనే కుతూహలమే పరిశోధనలకు మూలమని చెప్పారు. విద్యార్థి దశలో తాను చేసిన తొలి ప్రయోగం విఫలమైన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. పరాజయాలను విజయానికి మెట్లుగా మలచుకుని ప్రయత్నిస్తేనే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతామని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ఎం.కమల కుమారి మాట్లాడుతూ, సైన్స్ పట్ల ఆసక్తి, అభిరుచిని పెంచేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకట సత్య సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా వ్యాప్తంగా 88 పాఠశాలల నుంచి 93 ప్రాజెక్టులను ప్రదర్శించారని చెప్పారు. ఈ ప్రదర్శనకు కృషి చేసిన డీఈఓ కమల కుమారి, రామచంద్రపురం ఉప విద్యాశాఖాధికారి శ్రీపాద లక్ష్మీనరసింహఫణి, జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యాన్ని జేసీ అభినందించారు. తొలుత ఆమె సైన్స్ లోగోను, కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని, సైన్స్ పతాకాలను ఆవిష్కరించారు.

ఆసక్తిగా తిలకించిన జేసీ

జిల్లా విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి జేసీ శ్రీవాస్ నూపుర్ అజయ్ కుమార్ ఆసక్తిగా తిలకించారు. 12 గదుల్లో ఏర్పాటు చేసిన విద్యార్థి వ్యక్తిగత, గ్రూపు, ఉపాధ్యాయ విభాగాల్లో ఏర్పాటు చేసిన 93 ప్రాజెక్టులను సందర్శించారు. ప్రతి ప్రాజెక్టు వద్ద ఆగి విద్యార్థులను దాని వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను, గైడ్ ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో రామచంద్రపురం ఆర్‌డీఓ ఎస్.సుధాసాగర్, రామచంద్రపురం, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్లు గాధంశెట్టి శ్రీదేవి, రెడ్డి సత్య నాగేంద్రమణి, ఎంపీపీ అంబటి భవాని, మున్సిపల్ కౌన్సిలర్లు తోట అమ్మాజీ, కేతా సుజాత, నల్ల అంజమ్మ, డీసీఈబీ సెక్రటరీ బీర హనుమంతరావు, సమగ్ర శిక్షా సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, ఐఈ కో ఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, ఎంఈఓలు పి.షాలెంరాజు, నాయుడు రామచంద్రరావు, ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరి, హెచ్‌ఎంలు పోలిశెట్టి రాంబాబు, ఎం.వెంకట్రాజు, మాచిరాజు, ఎం.అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ జిల్లా రైతు విభాగం కమిటీ నియామకం

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రైతు విభాగం జిల్లా కమిటీని అధిష్టానం నియమించింది. జిల్లా అధ్యక్షునిగా జిన్నూరి వెంకటేశ్వరరావు (అమలాపురం నియోజకవర్గం); ఉపాధ్యక్షులుగా కొర్లపాటి కోటబాబు (పి.గన్నవరం), రాయుడు వెంకట రమణ (మండపేట); ప్రధాన కార్యదర్శులుగా కె.రాధాకృష్ణ (ముమ్మిడివరం), గెద్దాడ సుబ్రహ్మణ్యం (రామచంద్రపురం), ఎ.ప్రభాకరావు (అమలాపురం), గెద్దాడ సత్యనారాయణ (రాజోలు), మీసాల గంగయ్య (కొత్తపేట); కార్యదర్శులుగా మట్టపర్తి మీరాసాహెబ్‌శెట్టి (పి.గన్నవరం), సరెళ్ల అప్పారావు (పి.గన్నవరం), కె.సురేష్ (ముమ్మిడివరం), చీకట్ల గోపాలం (రామచంద్రపురం), వైట్ల రామకృష్ణ (రామచంద్రపురం), ఎం.రాంబాబు (అమలాపురం), ఎ.వెంకట రమణ (అమలాపురం), దంతులూరి అచ్యుత రామరాజు (రాజోలు), చేట్ల సత్యనారాయణ (రాజోలు), రేలంగి కిట్టయ్య (కొత్తపేట), దాట్ల సూర్య నారాయణరాజు (కొత్తపేట), మరివాడ సూరిబాబు (మండపేట), అద్దంకి వెంకట రమణ (మండపేట); సంయుక్త కార్యదర్శులుగా తులా గోపాలకృష్ణ (పి.గన్నవరం), దాసరి కాశీ (పి.గన్నవరం), పింకె రవి చంద్ర (రామచంద్రపురం), పలివెల సత్తిబాబు (రామచంద్రపురం), కె.సూర్య ప్రకాశరావు (అమలాపురం), జె.బాపిరాజు (అమలాపురం), చొపల మట్టయ్య కుమార్ (రాజోలు), రాపాక శ్రీనివాసరావు (రాజోలు), కుడుపూడి సత్యనారాయణ (కొత్తపేట), బెజవాడ సూరిబాబు (కొత్తపేట) నియమితులయ్యారు.

రామానుజన్ ప్రపంచానికే తలమానికం

రాయవరం: గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ ప్రపంచానికే తలమానికమని పలువురు వక్తలు అన్నారు. ఆయన 137వ జయంతి – గణిత దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామానుజన్ గొప్పతనాన్ని, రామానుజన్ నంబర్ 1729 ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులకు గణిత పోటీలు, గణితంలో క్విజ్ నిర్వహించారు. రామానుజన్ చిత్రపటం, పలు సిద్ధాంతాలు, ఈక్వేషన్లను విద్యార్థులు రంగవల్లులుగా తీర్చిదిద్ది, ఆకట్టుకున్నారు. మామిడికుదురు మండలం కరవాక జెడ్పీ హైస్కూలులో విద్యార్థులు రామానుజన్ నంబరు 1729 ఆకృతిలో ఏర్పడ్డారు. రాయవరం మండలం సోమేశ్వరంలో గణితావధాని నాగార్జున అవధాన ప్రక్రియ ఆద్యంతం అలరించింది. విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఇచ్చిన సమాధానాలు ఆకట్టుకున్నాయి. నాగార్జునను హెచ్‌ఎం ఆర్.దయామణి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. గణిత పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

క్లుప్తంగా

ఆంజనేయుని విగ్రహానికి నిప్పంటించిన వ్యక్తికి జైలు

కాకినాడ లీగల్: ఆంజనేయ స్వామి విగ్రహానికి నిప్పంటించిన దుండగుడికి 18 నెలల జైలు, రూ.500 జరిమానా విధిస్తూ కాకినాడ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.వెంకట్వేరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కాకినాడ చెందిన కూరాకుల శ్రీనివాస్ అలియస్ శ్రీను గత ఏడాది డిసెంబర్ 26న ఈ అకృత్యానికి ఒడిగట్టాడు. కాకినాడ అచ్యుతాపురం రైల్వే గేటు సమీపాన శ్రీకృష్ణ మందిరం వద్ద ఉన్న ఆంజనేయ స్వామి విగ్రహంపై పెట్రోలు పోసి నిప్పంటించాడు. దీనిపై ఆలయ ఈఓ నాగ సుబ్రమణ్య శ్రీనివాసులు కాకినాడ టూ టౌన్ పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు శ్రీనును నిందితుడిగా గుర్తించారు. కోర్టు విచారణలో శ్రీనుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

నేటి రాష్ట్రస్థాయి [illegible] పోటీలు / ర్యాంకులు [illegible]

[illegible] జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా రెజ్లింగ్ సంఘం ఆధ్వర్యంలో శని, ఆదివా[illegible]-15 విభాగంలో రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు డాక్టర్ జి.ఎలీషాబాబు శుక్రవారం తెలిపారు. పిఠాపురంలోని రాజీవ్ గాంధీ మున్సిపల్ స్కూల్‌లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. 25 జిల్లాల నుంచి 300 మంది బాలురు, బాలికలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. విజేతలు 27 నుంచి ఉత్తర్‌ప్రదేశ్ గోండాలో జరిగే ఆల్ ఇండియా రెజ్లింగ్ పోటీల్లో [illegible] ఆయన తెలిపారు. ఏపీ జట్టులో [illegible]

ర్యాంకులు సాధించిన విద్యార్థులతో చైర్మన్, డైరెక్టర్, డీన్

(రాజమహేంద్రవరం): [illegible]

పరిశోధన పత్రాలు రేపటిలోగా సమర్పించాలి

అసోసియేషన్ ఫర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ మ్యాథ్స్ ఎడ్యుకేషన్ [illegible] నిర్వహించే గణిత [illegible] తన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ [illegible]

ముక్తికి మార్గం.. వైకుంఠ ద్వార దర్శనం

- నేడు ముక్కోటి ఏకాదశి
- ఆలయాల్లో విస్తృతంగా ఏర్పాట్లు

అన్నవరం/ఆత్రేయపురం/మామిడికుదురు/పిఠాపురం: ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినానికి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ వైష్ణవ ఆలయాల్లో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో స్వామివారిని శనివారం ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. ఈ రోజు స్వామి వారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకోవడం ముక్తిప్రదమని విశ్వసిస్తారు. ఉత్తర ద్వారాలు తెరవనున్న నేపథ్యంలో ఆయా ఆలయాలను శుద్ధి చేసి, స్వామివారి దర్శనానికి అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు.

- అన్నవరం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ఇప్పటికే విష్ణుమూర్తి, లక్ష్మీదేవిగా అలంకరించి, ప్రధానాలయంలో ఉత్తరాభిముఖంగా ఆశీనులను చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆలయం తలుపులు తెరచి ప్రత్యేక పూజల అనంతరం విశాఖ శ్రీ శారదా పీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామి తొలి దర్శనం చేసుకుంటారు. అనంతరం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఉత్తర ద్వారం నుంచి స్వామివారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. అనంతరం పశ్చిమ ద్వారం నుంచి అనుమతిస్తారు. ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో వెండి రథంపై స్వామివారి ప్రాకార సేవ నిర్వహిస్తారు. భక్తులకు కదంబం ప్రసాదం పంపిణీ చేస్తారు. రాత్రి 7 గంటల నుంచి అన్నవర గ్రామ వీధుల్లో స్వామి, అమ్మవార్లకు వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహిస్తారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా సత్యదేవుని ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తూర్పు రాజగోపురం మెట్లపై పూలమొక్కలు ఏర్పాటు చేశారు. ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో, పూలతో అలంకరించారు. స్వామివారి ఆలయం దిగువ నుంచి ఉత్తర ద్వార దర్శనానికి క్యూ లైన్ ఏర్పాటు చేశారు. వెండి రథాన్ని కూడా పూలమాలలతో అలంకరిస్తున్నారు.
- ఆత్రేయపురం మండలంలో కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు.
- మామిడికుదురు మండలం అప్పనపల్లిలోని శ్రీ బాలబాలాజీ స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ బాలబాలాజీ స్వామి వారు వేకువన 4 గంటల నుంచి ఉత్తర ద్వారం వద్ద భక్తులకు దర్శనమిస్తారని ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ జి.మాధవి తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటలకు ఆండాళ్ తాయార్(గోదాదేవి)కు లక్ష చామంతి పూజ నిర్వహిస్తున్నారు.
- దేశంలోని పంచ మాధవ క్షేత్రాల్లో ఒకటైన పిఠాపురం శ్రీ కుంతీమాధవుని ఆలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తున్నారు.
- వీటితో పాటు అంతర్వేది, కోరుకొండల్లోని శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, కాకినాడ సర్పవరంలోని శ్రీ భావనారాయణస్వామి, పెద్దాపురం మండలం తిరుపతిలోని శ్రీ శృంగార వల్లభస్వామి తదితర ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడనున్నాయి.


వాడపల్లిలో ఉత్తర ద్వార దర్శనానికి చేసిన ఏర్పాట్లు


వాడపల్లిలో ఏర్పాటు చేసిన ఏడు ద్వారాలు


ఆలయ ప్రాంగణంలో పూలదండలతో చేసిన ముస్తాబు

గీతాజ్ఞానం.. సర్వోపనిషత్తుల సారం

రాయవరం: భగవద్గీతను భారత హైందవజాతి తాత్విక, వైజ్ఞానిక తత్వసారంగా, జీవన మార్గదర్శినిగా భావిస్తుంది. గీతా సారాంశాన్ని జీవితానికి అన్వయించుకుంటే సమాజంలో అశాంతి అన్న పదమే వినబడదని గీతా బోధకులు చెబుతారు. భగవద్గీతను అనుసరిస్తే సన్మార్గానికి బాటలు వేసినట్లే. కురుక్షేత్ర మహాసంగ్రామంలో అర్జునుడు నెరవేర్చాల్సిన బాధ్యతలను గుర్తు చేస్తూ.. నిజాలు వివరిస్తూ.. శ్రీకృష్ణుడు ఈ గీతోపదేశం చేశాడు. ఫలితంగా అర్జునుడిని ఆవహించిన అహంకార మమకారాలు విడిపోయాయి. కర్తవ్యం స్పష్టంగా బోధపడి, యుద్ధరంగంలో విజేతగా నిలిచాడు. ప్రతి మనిషి కర్తవ్యంతో పాటు జీవన విధానాన్ని వివరించేదే గీతాసారం. అందుకే భగవద్గీత ఆవిర్భవించిన రోజును ఏటా గీతా జయంతిగా నిర్వహిస్తున్నారు. భగవానుడైన శ్రీకృష్ణుడు కార్తిక అమావాస్య రోజున భగవద్గీతను అర్జునుడికి బోధించాడని, మార్గశిర శుద్ధ ఏకాదశి రోజున సంజయుడు ధృతరాష్ట్రుడికి చెప్పడంతో ఇది వెలుగులోకి వచ్చిందని.. అందుకే ఈ రోజే గీతా జయంతి అని పెద్దలు చెబుతారు. ఈసారి ఈ రెండు పర్వదినాలూ భగవానుడికి ప్రీతికరమైన శనివారం రావడం పరమ పుణ్యప్రదమని భక్తులు భావిస్తున్నారు. పలు ప్రాంతాల్లోని గీతా మందిరాల వద్ద గీతా జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


మందిరాల వద్ద గీతా జయంతిని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సామాజిక సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

- రూ.2.36 లక్షల కోట్లతో సంక్షేమం
- విపక్షాల కుట్రలకు ప్రజలే బుద్ధి చెబుతారు
- వైఎస్సార్ సీపీ నేతల ఉద్ఘాటన

కపిలేశ్వరపురం: సామాజిక సాధికార సాధనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర శుక్రవారం మండపేటలో జరిగింది. ఈ సందర్భంగా తాపేశ్వరంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఇతర పేద వర్గాల వారికి పెద్ద ఎత్తున సంక్షేమాన్ని అమలు చేశారన్నారు. దీంతో పాటు వివిధ పదవుల్లో సైతం అధిక ప్రాధాన్యం ఇవ్వడం దేశ చరిత్రలోనే ప్రథమం అని చెప్పారు. రాజ్యాంగం ప్రకారం 50 శాతం వరకే రిజర్వేషన్లు అమలు చేయాల్సి ఉన్నప్పటికీ మరో 10 శాతం అదనంగా పార్టీ నుంచి కల్పించి అమలు చేసిన ఘనత జగన్‌దేనని చెప్పారు. సామాజిక వెనుకబాటుతనానికి కారణమైన విద్యా వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు పెద్ద ఎత్తున సంక్షేమాన్ని అమలు చేస్తున్నారన్నారు. రూ.2.36 లక్షల కోట్ల మేర ప్రజల సంక్షేమానికి వెచ్చించారని తెలిపారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేస్తున్నారంటూ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న ప్రతిపక్షాలు.. వచ్చే ఎన్నికల్లో ఈ సంక్షేమ పథకాలను రద్దు చేస్తామని చెప్పగలరా అని ప్రశ్నించారు. చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన లేని నాయకుల వైఖరి వల్లనే వారి పట్ల, రాజకీయ పార్టీల పట్ల ప్రజల్లో విలువ తగ్గిపోతోందని అన్నారు. దీనికి భిన్నంగా ఇచ్చిన హామీలను దాదాపు నూరు శాతం అమలు చేసిన సీఎం దేశం మొత్తం మీద జగన్ ఒక్కరేనని చెప్పారు. తద్వారానే ప్రజల హృదయాలను గెలుచుకున్నారని అన్నారు. 50 లక్షల మంది రైతులున్న రాష్ట్రంలో వారికి రూ.1.40 లక్షల కోట్ల మేర సాయం అందించారని గుర్తు చేశారు. వడ్డీ లేని రుణం, ఉచిత పంటల బీమా, రూ.లక్షల విలువైన బోరును ఉచితంగా వేయించడం వంటివి దేశంలో సీఎం జగన్ మాత్రమే అమలు చేస్తున్నారని బోస్ చెప్పారు. యంత్ర పరికరాలు 40 శాతం సబ్సిడీతో అందిస్తున్నారన్నారు. రాష్ట్రం రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌లో ఉండగా ఆదుకోవాల్సిన కేంద్రం రాష్ట్ర పునర్విభజన బిల్లులోని అంశాలను కూడా అమలు చేయడం లేదని తెలిపారు. లోటు బడ్జెట్‌ను కేంద్రమే పూడ్చాలని చట్టంలో ఉన్నప్పటికీ విస్మరిస్తోందన్నారు. చంద్రబాబు గతంలో 642 హామీలిచ్చి, 600 గాలికి వదిలేశారని, బీసీలకు 112 హామీలిచ్చి 12 మాత్రమే అమలు చేశారని గుర్తు చేశారు. కరోనా కాలంలో ప్రజలందరికీ సేవలందించడంపై పార్లమెంట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ, తొలిగా సీఎం జగన్ పేరు చెప్పి ప్రశంసించారని గుర్తు చేశారు. ఈ విషయాలన్నీ ప్రజలకు వివరించి, జగన్ నాయకత్వాన్ని బలపరచాలని కోరేందుకే బస్సు యాత్ర చేస్తున్నామని బోస్ చెప్పారు.

రాష్ట్ర ఎస్సీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకరరావు మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆశించిన సామాజిక సాధికార లక్ష్యం కోసం సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని అన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో రాష్ట్రం అనేక సవాళ్లను ఎదుర్కొందని, అయినప్పటికీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సామాజికవర్గాల అభ్యున్నతికి సంక్షేమాన్ని అమలు చేయడంలో ప్రభుత్వం ముందుకే సాగుతోందని చెప్పారు. రాష్ట్ర పునర్విభజన చట్టంలోని అంశాల అమలు కోసం ఉద్యమిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తోందని, గత టీడీపీ ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేకుండా రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని అన్నారు. సంక్షేమంలో ముందుకు సాగుతున్న సీఎం జగన్ ప్రభుత్వాన్ని ఓడించాలంటూ పవన్ కల్యాణ్‌ను తోడు తెచ్చుకుని చంద్రబాబు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. రూ.2.37 లక్షల కోట్ల మేర సంక్షేమాన్ని అమలు చేసిన జగన్‌ను ఎందుకు ఓడించాలనే ప్రశ్నకు వారి వద్ద సమాధానం లేదన్నారు. 'జగనన్న ఆలోచనా విధానం ఆంధ్రప్రదేశ్‌లో వర్ధిల్లాలి.. ఇది దేశానికి ఒక మోడల్ కావాలి' అనే నినాదంతో బస్సు యాత్ర సాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మండపేట నియోజకవర్గ కో ఆర్డినేటర్ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, పార్టీ బీసీ సెల్ రీజినల్ కో ఆర్డినేటర్ రాజబాబు, నాయకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, దూలం వెంకన్నబాబు పాల్గొన్నారు.


సంక్షేమ వివరాల బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట, ఎంపీ బోసు తదితరులు

రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- తాండవ నదిపై బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన


కోటనందూరులో తాండవనదిపై బ్రిడ్జి నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: రాష్ట్రంలో రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తెలిపారు. కోటనందూరులో తాండవ నదిపై రూ.10 కోట్ల వ్యయంతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ గరిసింగు శివలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ ఐదు దశాబ్దాల క్రితం తాండవ నదిపై నిర్మించిన కాజ్ వే శిథిలావస్థకు చేరి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నా.. గత పాలకులు పట్టించుకోలేదన్నారు. వరదలు, భారీ వర్షాల సమయంలో నదిలో వరద నీరు కాజ్‌వేపై ప్రవహించి తుని–నర్సీపట్నం రోడ్డు, కోటనందూరు గ్రామానికి సంబంధాలు తెగిపోతున్నాయన్నారు. కోటనందూరు మండల ప్రజాప్రతినిధులు, ప్రజల విజ్ఞప్తి మేరకు బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు తీసుకొచ్చామన్నారు. గడువు కన్నా ముందే బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. భవిష్యత్‌లో కోటనందూరు మండల ప్రజలకు వరద కష్టాలు తీరతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఏఎంసీ చైర్మన్ లంక ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు గొర్లి రామచంద్రరావు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి గోవిందు, గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, దార్ల సూర్యచంద్ర, ఉల్లూరి శ్రీను పాల్గొన్నారు.

రాముడు స్థితప్రజ్ఞుడు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'పట్టాభిషేకమంటే రాముడు పొంగిపోలేదు. వనవాసమంటే కుంగిపోలేదు. ఆయన రెండింటినీ సమానంగానే స్వీకరించిన స్థితప్రజ్ఞుడు' అని సమన్వయ సరస్వతి సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. హిందూ సమాజంలో పదో రోజు సాగించిన ప్రవచనంలో అయోధ్య కాండలోని పలు కీలక సన్నివేశాలను ఆయన వివరించారు. 'పట్టాభిషేక మహోత్సవానికి ఏర్పాట్లన్నీ పూర్తయిన వైనాన్ని దశరథ మహారాజుకు విన్నవించడానికి మంత్రి సుమంత్రుడు అంతఃపురంలోకి ప్రవేశించాడు. ఆయన అంతఃపురంలోకి ప్రవేశించడానికి ఎటువంటి నియమాలూ లేవు. పున్నమి జాబిలిని చూసిన సముద్రునిలా ప్రజావాహిని ఉప్పొంగిపోతోందని రాజుకు నివేదించడానికి వచ్చిన సుమంత్రుడు.. రాజు ముఖంలోని దైన్యాన్ని చూసి, నివ్వెరపోయాడు. వెంటనే రాముడిని తీసుకురమ్మని కైకేయి చెప్పిన మాటలను అమలు చేయడానికి రాజాజ్ఞ లేదని ఆయన సందేహించాడు. దశరథుడు కూడా రాముడిని తీసుకురమ్మని ఆదేశించాడు. అంతఃపురానికి వస్తున్న రాముడిని చూసి ప్రజలు ఇలా భావించారు. ఎవడు రాముడిని చూడడో, రాముడు ఎవరిని చూడడో వాడు సర్వకాలాల్లో నింద్యుడు. రాముని వైపు ప్రసరించిన చూపు, మనస్సు వెనక్కు మళ్లవు. కైక ద్వారా ఆమెకు దశరథుడు ప్రసాదించిన వరాలు విన్న రాముడు తనకు ధనం, పదవీ వ్యామోహాలు లేవని, తాను రుషి తుల్యుడినని ఆమెకు చెబుతాడు' అంటూ కీలక సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్టుగా సామవేదం వివరించారు. జీవితం ఎందుకని సాధకులు అడిగిన ప్రశ్నకు పరమాత్మను చూడటానికేనని రామకృష్ణ పరమహంస తడుముకోకుండా చెప్పాడని చెప్పారు. అయోధ్య కాండలో రత్నాల వంటి అనేక శ్లోకాలున్నాయని అన్నారు.


సామవేదం షణ్ముఖశర్మ

శోభాయమానం.. శ్రీవారి గిరి ప్రదక్షిణం


భక్తులు, కళాకారులతో కిక్కిరిసిన రహదారి


రథం వెంట గిరి ప్రదక్షిణగా వెళుతున్న భక్తులు

- చిన్న తిరుపతిలో వైభవంగా వేడుక
- వేలాదిగా పాల్గొన్న భక్తులు

ద్వారకా తిరుమల: శ్రీవారి క్షేత్రంలో స్వామివారి గిరి ప్రదక్షిణోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్చారణలు, గజ, అశ్వ, వృషభ సేవల నడుమ జరిగిన ఈ వేడుక ఆద్యంతం కన్నులపండువగా సాగింది. భక్తజనులు చేసిన గోవింద నామోచ్ఛారణలతో క్షేత్ర పరిసరాలు ప్రతిధ్వనించాయి. తొలుత ఆలయ ప్రధాన కూడలిలో స్వామివారి ధర్మ ప్రచార రథాన్ని పుష్పమాలికలతో విశేషంగా అలంకరించారు. రథంలో కొలువైన శ్రీవారికి ఆలయ చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు, ఈఓ వేండ్ర త్రినాథరావు దంపతులు, అనువంశిక ధర్మకర్త ఎస్‌వీ నివృతరావు, పలువురు ట్రస్టు బోర్డు సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్, ఈఓ జెండా ఊపి రథాన్ని ప్రారంభించారు. స్వామివారి వైభవాన్ని చాటుతూ గజలక్ష్మి, అశ్వాలు, వృషభాలతో పాటు చిత్ర విచిత్ర వేషధారణలు, కోలాట భజనలు, డప్పు వాయిద్యాలు, శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీరామ వానర సైన్యం నాటిక ప్రదర్శనలు, కోలాట నృత్యాలతో గిరి ప్రదక్షిణ కోలాహలంగా ముందుకు సాగింది. రథం వెనుక భక్తులు, గోవింద స్వాములు, వారి బంధుమిత్రులు వేలాదిగా పాల్గొన్నారు. గోవిందా.. గోవిందా.. అంటూ గిరి చుట్టూ పాదయాత్రగా తిరిగారు. దాతల సహకారంతో భక్తులకు ఆలయ అధికారులు మార్గం మధ్యలో పలు రకాల పండ్లు, పాలు, టీలు, మంచినీటిని అందించారు. ఈ గిరి ప్రదక్షిణోత్సవం క్షేత్రం నుంచి దొరసానిపాడు, రాళ్లకుంట రహదారి మీదుగా కొండ పైకి, అక్కడి నుంచి ఉగాది మండపం మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఐదు కిలోమీటర్ల మేర అట్టహాసంగా, ఆడంబరంగా, వైభవోపేతంగా జరిగిన ఈ వేడుక భక్తులను పరవశింపజేసింది. భీమడోలు నుంచి గోవింద స్వాములు తీసుకువచ్చిన రథం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


ధర్మప్రచార రథంలో కొలువైన స్వామివారు


రథాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు, ఈఓ త్రినాథరావు

పంచారామ కార్తిక ఆదాయం రూ.96.98 లక్షలు

సామర్లకోట: కార్తిక మాసంలో పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరాలయంలో రూ.96,98,676 ఆదాయం వచ్చినట్లు ఈఓ నాగమల్లేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆలయంలో హుండీల లెక్కింపు జరిగింది. హుండీలద్వారా రూ.23,82,915ఆదాయం వచ్చిందని చెప్పారు. పూజా రుసుం కింద రూ.51,96,171, అన్నదానానికి విరాళంగా రూ.21,19,590 వచ్చిందన్నారు. ట్రస్టు బోర్డు సభ్యులు యండమూరి వెంకట్రావు, నాతిపాముల సూరిబాబు, భక్త సంఘం నాయకులు బీవీ రమణ, చల్లా సత్తిబాబు హుండీల లెక్కింపులో పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.